ప్రజాశక్తి

ఆదివారం 9 ఏప్రిల్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ప్రకాశం, బాపట్ల

జేసీలుగా శ్రీనివాసులు, శ్రీధర్

ఐఏఎస్‌ల బదిలీల్లో మార్పులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

ఐఏఎస్ బదిలీల్లో మార్పుల ఫలితంగా ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ల బదిలీల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. రెండు రోజుల క్రితం ఇచ్చిన ఉత్తర్వులలో ప్రకాశం జాయింట్ కలెక్టర్‌గా చెమకూరి శ్రీధర్‌ను ప్రకటించగా.. తర్వాత జరిగిన మార్పుల్లో ఆయనను బాపట్ల జేసీగా బదిలీ చేశారు. ప్రకాశం జాయింట్ కలెక్టర్‌గా బాపట్లలో జేసీ పనిచేస్తున్న కె.శ్రీనివాసులును నియమించారు.

ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిషిక్త్ కిషోర్‌ను ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీగా బదిలీ చేశారు. జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా బాపట్ల జేసీగా పనిచేస్తున్న కె.శ్రీనివాసులును బదిలీ చేశారు.

బాపట్ల జేసీగా శ్రీధర్

బాపట్ల జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా చెమకూరి శ్రీధర్ బదిలీపై రానున్నారు. గత ఏడాది కాలంగా బాపట్ల జెసిగా పనిచేసిన కె.శ్రీనివాసులు ప్రకాశం జిల్లా జేసీగా వెళ్లనున్నారు. మూడు రోజుల క్రితం వచ్చిన బదిలీ ఉత్తర్వుల్లో శ్రీధర్‌ను ప్రకాశం జేసీగా నియమించినట్లు పేర్కొన్నారు. ఆ తరువాత సదరు ఉత్తర్వులను మార్చి శ్రీధర్‌ను బాపట్ల జేసీగా పంపుతూ ఉత్తర్వులిచ్చారు. 2016 ఐఏయస్ బ్యాచ్‌కు చెందిన శ్రీధర్ సిసిఎల్ఏ సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తూ.. బాపట్ల జిల్లా జేసీగా రానున్నారు. బాపట్లలో పనిచేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ కూడా బదిలీ అయ్యారు. బాపట్ల జిల్లాలో కలెక్టర్, జేసీ ఇద్దరూ కొత్తగా రానున్నారు.

జేసీలు శ్రీనివాసులు, శ్రీధర్ (ఫైల్)

నా మాటలు వక్రీకరించారు

ఎమ్మెల్యే కోన రఘుపతి

▲ 2లో

సిఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

- పరిశీలించిన మంత్రి సురేష్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి
- అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మార్కాపురం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. పట్టణంలోని ఎస్‌వికెపి కళాశాల ప్రాంగణంలో ఇబిసి నేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు సిఎం జగన్ రానున్న నేపథ్యంలో ముందస్తుగా ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్, ఎస్‌పి మలికగర్గ్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఎంఎల్‌సి తలశిల రఘురాం, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శనివారం పరిశీలించారు.

అనంతరం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నిమిత్తం నియమించిన ప్రత్యేక అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని స్థానిక ఎస్‌వికెపి కళాశాలలో నిర్వహించారు. ఎస్‌వికెపి కళాశాల ప్రాంగణంలో సభా వేదిక, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో హెలిప్యాడ్ ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాలను, బారికేడ్ల ఏర్పాట్లు, సిఎం కాన్వాయ్ రూట్, చుట్టూ ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి... అక్కడ జరుగుతున్న అన్ని ఏర్పాట్లను సమీక్షించారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలానికి ముఖ్యమంత్రి చేరుకొనే క్రమంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. హెలీప్యాడ్ సమీపంలో ఎత్తైన కరెంటు స్తంభాలను తాత్కాలికంగా తొలగించాలని ఆయన సూచించారు. దారి పొడవునా ప్రజలను ముఖ్యమంత్రి వీక్షించేలా, రాకపోక లకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అర్జీలను స్వీకరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని మంత్రి చెప్పారు. సభా ప్రాంగణానికి వచ్చే వారికి అవసరమైన అల్పాహారం, తాగునీరు, వేసవి దష్ట్యా మజ్జిగ అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ విషయంలో సమన్వయంతో పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా వివిధ పనులు చేపట్టడానికి పలువురు జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. బందోబస్తు పరంగా ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా తీసుకుంటున్న చర్యలను, పోలీసు సిబ్బందిని మోహరిస్తున్న తీరును ఎస్పీ వివరించారు. కాగా పర్యటనను సమన్వయం చేస్తూ ప్రణాళిక ప్రకారం ఇది సాగేలా ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పి నాగేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ ఐపీఎస్ అంకిత సురానా, పలువురు జిల్లాస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హోదాలో ▶ 2లో

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సురేష్

ఒంగోలులో వందేభారత్ ఎక్స్‌ప్రెస్

- స్వాగతం పలికిన మంత్రి సురేష్, ఎంపీ మాగుంట
- రైలును సెల్‌ఫోన్లలో బంధించేందుకు పోటీ పడిన ప్రజలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భారత రైల్వే శాఖలో అత్యంత వేగవంతమైన రైలుగా పేరొందిన 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్ రైలు' శనివారం సాయంత్రం ఒంగోలు చేరుకుంది. ఈ రైలుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత స్వాగతం పలికారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును హైదరాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఉదయం ప్రారంభించిన సంగతి తెలిసిందే. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి తిరుపతికి కేవలం 8.30 గంటలలో చేరుకోనుంది. ప్రతిరోజూ ఈ రైలును నడిపేందుకు రైల్వే అధికారులు నిర్ణయించటంతో జిల్లా ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి ఒంగోలు నుంచి తిరుపతికి కేవలం మూడు గంటలలోనే చేరుకోవచ్చు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును చూసేందుకు నగర ప్రజానీకం తరలిరావటంతో ఒంగోలు రైల్వేస్టేషన్ కిటకిటలాడింది. ఒంగోలు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, బ్యాండ్ బృందం రైలుకు స్వాగతం పలికారు. జాతీయ పతకాలను చేతబూని, రైలుపై పూలు చల్లారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును చూసేందుకు ఒంగోలు నగర ప్రజానీకం ఆసక్తి చూపారు. రైలును సెల్‌ఫోన్లలో బంధించేందుకు ప్రజానీకం పోటీపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వే పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రైలు ఎక్కి రైల్వే అధికారులతో పలు విషయాలు చర్చించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు, చీరాల మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, తాతా ప్రసాద్, అయినాబత్తిని ఘనశ్యాం, చెరుకూరి ఆదిలక్ష్మి, పలువురు వైసిపి నాయకులు, రైల్వే అధికారులు, స్టేషన్ సూపరింటెండెంట్, ప్రజలు పాల్గొన్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సురేష్, ఎంపీ మాగుంట

'పశ్చిమ ప్రకాశం'పై

చంద్రబాబు ప్రత్యేక దృష్టి

19 నుంచి మూడు నియోజకవర్గాల్లో విస్తృత పర్యటన

ప్రజాశక్తి మార్కాపురం రూరల్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పశ్చిమ ప్రకాశంలో పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఆయన ఈ నెల 19 ,20, 21 తేదీలలో మార్కాపురం డివిజన్ లో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చంద్రబాబు 19వ తేదీ గిద్దలూరు, 20న మార్కాపురం, 21వ తేదీ య యర్రగొండపాలెం నియోజకవర్గాలలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి, ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడు పశ్చిమ ప్రకాశంలోని మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌ఛార్జిలతో శనివారం మాట్లాడి చంద్రబాబు పర్యటన ను ఖరారు చేసినట్టు తెలిసింది.

ఈ నెల 20న చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా అదే రోజు ఆయన మార్కాపురంలో పర్యటించనుండడం విశేషం. దీంతో మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

టిడ్కో గృహాలపై చర్చకు సిద్ధమా.?

- చంద్రబాబునాయుడికి మంత్రి సురేష్ సవాల్
- త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని ప్రకటన

▲ 2లో

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

సిఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం తొలిసారిగా వస్తున్నారు. ఈ నేపథ్యంలో సభను సక్సెస్ చేయాలని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డితో పాటు వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిలు వైసిపి నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

కాలువ చివరి భూములకు

20 వరకు సాగర్ నీళ్లివ్వాలి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామారావు డిమాండ్

ప్రజాశక్తి-పంగులూరు

ఈ నెల 20వ తేదీ వరకు, సాగర్ కాలువల చివరి భూములకు సాగునీరు ఇవ్వాలని రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పంగులూరులోని రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సాగర్ కాలువల కింద సాగయ్యే మొక్కజొన్న పంటకు, కొంత మిర్చి పంటకు ఒక తడి నీటి అవసరం ఉందని పేర్కొన్నారు. రబి సీజన్ ప్రారంభంలో ఈ ప్రాంతంలో కురిసిన అధిక వర్షాలకు కొంతమంది రైతులు, తమ పైర్లను చెడగొట్టి మొక్కజొన్న వేశారని, అందువల్ల కొంత భాగం మొక్కజొన్న ఆలస్యంగా సాగయిందని చెప్పారు. బాపట్ల జిల్లాలో నాగార్జునసాగర్ కాలువల కింద, ఈ సంవత్సరం రబీ సీజన్లో సుమారు 40 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, అయితే ఈ పాటకే పాతిక వేలు ఎకరాల పంట చేతికి వచ్చిందని తెలిపారు. మిగిలిన 15 వేల ఎకరాలకు ఒక తడి నీటి అవసరం ఉందని, ఇప్పుడు నీటి తడి ఇవ్వకపోతే కండెలు తాలు గింజలుగా మారే అవకాశం ఉందని, దీని వల్ల మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. రెండు రోజుల క్రితమే సాగర్ కాలువల్లో నీటిపారుదలను అధికారులు నిలిపివేశారని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు రైతుల పరిస్థితి గమనించి, ఈనెల 20వ తేదీ వరకు నీటిపారుదలను కొనసాగించాలని కోరారు. జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ జిల్లాలో సాగర్ కాలువల కింద ఇంకా కొంత మిర్చి పైరు మిగిలిందని, ఈ పైరుకు ఒక తడికి నీరు ఇస్తే, రైతులకు కొంత ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఇంజన్ల ద్వారా నీళ్లు పెట్టుకోవాలంటే వేలల్లో ఖర్చు పెట్టాల్సి వస్తుందని, అందువల్ల అధికారులు ఈ నెల 20వ తేదీ వరకు నీళ్లు ఇచ్చి మిర్చి రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యకర్తలు తల్లపనేని సుబ్బారావు, బత్తుల సుబ్బారావు, కొల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తల్లపనేని రామారావు

నా మాటలు వక్రీకరించారు : కోన

ప్రజాశక్తి బాపట్ల

బాపట్ల జిల్లా ఆవిర్భవించి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సభలో సభలో తాను చేసిన ప్రసంగాన్ని కొందరు వక్రీకరించినట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసే విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న జిల్లా ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో తాను మాట్లాడిన మాటలు కొంతమందికి కంటగింపుగా, ఇబ్బందికరంగా ఉందేమో తనకు తెలియదని తెలిపారు. అయితే కొందరు తన మాటల్లో పదాల్ని వక్రీకరిస్తూ ఎస్‌సి సామాజిక వర్గానికి బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని రిజర్వేషన్ చేసే విషయంపై తనకు వేరే అభిప్రాయం ఉందని చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఆ ప్రయత్నం దురదృష్టకరమని తెలిపారు. ఒక పదానికి అనేక అర్థాలు ఉంటాయని తెలిపారు. బాపట్ల జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా తాను ఓ రాజకీయ పార్టీని ఉటంకిస్తూ మాట్లాడినట్లు తెలిపారు. 1977లో బాపట్ల పార్లమెంట్ స్థానం ఏర్పాటు అయినట్లు తెలిపారు. అప్పట్లో జేడీ శీలం లేరని తెలిపారు. జేడీ శీలం కోసం ఎస్‌సి రిజర్వుడ్ నియోజకవర్గంగా ఉన్న నెల్లూరు నియోజకవర్గ రిజర్వేషన్ తొలగించి బాపట్ల పార్లమెంట్‌ను ఎస్‌సి నియోజక వర్గంగా మార్పు చేసినట్లు తెలిపారు. ఆ నిర్ణయం వల్ల శీలంకు లబ్ధి జరిగిందేమో గాని బాపట్ల జిల్లాకు లబ్ధి జరగలేదని తెలిపారు. అప్పట్లో ఇదే నియోజకవర్గంలోని పొన్నూరును పోగొట్టుకున్నట్లు తెలిపారు. కలుపుకున్న సంతనూతలపాడును నిలబెట్టుకోలేక పోయాని తెలిపారు. ఆ రెండు నియోజకవర్గాలు ఉంటే జిల్లా ఆర్థిక పరిస్థితి బాగుండేది అనేదే తన ఉద్దేశ్యమని తెలిపారు. తన మాటలు ఎవరికైనా బాధించి ఉంటే క్షమించమని కోరుతున్నట్లు తెలిపారు. అనంతరం నా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కోకి రాఘవరెడ్డి, యెర్రయ్య, చేజర్ల నారాయణరెడ్డి, ఇనగలూరి మాల్యాద్రి, వడ్డిముక్కల డేవిడ్, పిల్లి శేఖర్, దొంతిబోయిన సీతారామిరెడ్డి, పీటా బాబు, మూల పాలెం సర్పంచి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

సైడు కాలువలు కట్టి.. మార్జిన్ మరిచి..

అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-పామూరు

పామూరు పంచాయతీ పరిధిలోని గోపాలపురం ఎస్‌సి కాలనీలో ఇటీవల సైడు కాలువలు నిర్మించారు. కాలువల నిర్మాణ సమయంలో తవ్విన గుంతలను అలాగే వదిలేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్జిన్‌లో గుంతలు ఉండటంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. గోపాలపురం ఎస్‌సి కాలనీ, హైవే రోడ్డు ప్రక్కన సైడు కాలువలు నిర్మించి నెలలు గడుస్తుంది. సైడు మట్టి తోలకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌సి కాలనీకి ప్రక్కనే ప్రభుత్వ పాఠశాల ఉంది. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు సైడు కాలువ దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సైడు కాలువలు కట్టి దానిపై మూత వేయలేదు. దీంతో రాకపోకల సమయంలో విద్యార్థులు, గ్రామస్తులకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. విద్యార్థులు బ్యాగులు తగిలించుకుని సైడు కాలువ దాటుతూ కాలువలో పడిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైడు కాలువలపై మూతలు వేయాలని ప్రకజలు కోరుతున్నారు.

సైడు కాలువ వద్ద మార్జిన్‌ను పూడ్చని దృశ్యం

కాలువపై మూత ఏర్పాటు చేయని దృశ్యం

మహారాజశ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం :212/2020

మాడిశెట్టి లక్ష్మీ కోటేశ్వరరావు ... వాది

వర్సెస్

గుడిమెట్ల ఇస్సాకు మరియు ఆరుగురు ఇతరులు ... ప్రతివాదులు

టు,

D4) మురికిపూడి స్వరూప, భర్త కాశయ్య, ఆర్/ఓ హసనాపురం గ్రామం త్రిపురాంతకం మండలం ప్రకాశం జిల్లా.

D6) గుడిమెట్ల @ పల్లె రాణెమ్మ, భర్త ఇజ్రాయేలు, ఆర్/ఓ ఉమ్మడివరం గ్రామం, త్రిపురాంతకం మండలం, ప్రకాశం జిల్లా.

మీకు పై కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన మీకు నోటీసు నిమిత్తం శ్రీ కోర్టు వారు తేదీ :19-04-2023న ఉదయం గంల కు 10:30 గంటలకు పై కోర్టులో స్వయంగా గాని లేక ఏజెంట్ ద్వారా కానీ హాజరై ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపు కొనవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 19-04-2023 ఇట్లు

జి.టి.శివశర్మ
వాది తరుపు అద్వకేట్,
దర్శి, ప్రకాశం జిల్లా.
సెల్ :9505400327

స్థలం ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం మున్నంగి వారి పాలెం లో నివాసం ఉండే చెరుకూరి వీరాస్వామి తండ్రి: సుబ్బారావుకి చెందిన డాక్యుమెంట్ నెంబర్ 1823/1988 ఒంగోలు మండలం ముక్తినూతలపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 249 తో సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఒంగోలు నందు రిజిస్టర్ కాబడిన 25 గదులు (200 చదరపు గజాలు) గల ఖాళీ స్థలం ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ తీయు నిమిత్తం మున్నంగి వారి పాలెం నుండి యద్దనపూడి కి బైక్ పై వెళుతుండగా పోయినవి. దొరికినవారు క్రింది చిరునామాకు తెలుపగలరు.

చెరుకూరి వీరాస్వామి,
తండ్రి సుబ్బారావు
మున్నంగి వారి పాలెం,
యద్దనపూడి (మం)
బాపట్ల జిల్లా
సెల్ : 9603334872

REPALLE CHRISTIAN COLLEGE OF EDUCATION
REPALLE- 522265, Bapatla District, AP

Under the Management of India Rural Evangelical fellowship
Approved by NCTE Affiliated to Acharya Nagarjuna University.

Eligible Candidates can attend for the Spot and management Category "B" Admissions into B.Ed Course for the Academic year 2022-23 along with all original certificates on or before 10-04-2023. Admissions are subject to the Guidelines & Approval of competent authority Contact:9247248726,9849173414

Dr.Emmanuel Rebba
Secretary & Correspondent.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 163/2018

కోలగట్ల చెన్నయ్య మరియు ఇతరులు ......వాదులు

వర్సెస్

ఇమ్మడిశెట్టి వెంకటసుబ్బారావు మరియు ఇతరులు .... ప్రతివాదులు

టు,

చీదెళ్ల వెంకట భాస్కర్‌రావు,
తండ్రి: చిన్న వెంకటేశ్వర్లు, హిందూ,
ఎస్‌బిఐ రోడ్డు, నివాసం: యర్రగొండపాలెం గ్రామం,
యర్రగొండపాలెం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను వాదులు నీ మరియు కొంత మంది మీద డిక్లరేషన్ మరియు ఇంజన్షన్ కొరకు దాఖలు చేసి ఉన్నారు. ఈ దావా నందు నీకు ఎన్ని పర్యాయములు దావా సమనులు కోర్టు వారి ద్వారా పంపిననూ నీవు తీసుకొనకుండా కాలాయాపన చేసి తప్పించుకుని తిరుగుచున్నావు. కావున నీకు కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా సమనులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 01-05-2023వ తేదీ ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించ బడునని ఖండితముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 01-05-2023

వి.శ్రీనివాసరావు
అద్వకేట్, మార్కాపురం

బహిరంగ వేలము నోటిసు

గ్రామపంచాయితీ కార్యాలయము, ఈపురుపాలెం చీరాల మండలం

ఆర్.సి. నెం.1/2023 **తేది: 06-04-2023**

బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెం గ్రామపంచాయితీ నందు గల ఆంధ్రరత్న కూరగాయల మార్కెట్ మరియు జంతు వధశాల యందు 2023-24 సంవత్సరమునకు అనగా తేది : 01-04-2023 నుండి 31 -03-2024 వరకు 1సంవత్సర కాలమునకు దినసరి రుసుములు వసూలు చేసుకోను హక్కులను గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద విడివిడిగా తేది : 12-04-2023 న మద్యాన్నం 3.00 గంటలకు బహిరంగ వేలము ద్వారా విక్రయించ బడును. కావున ఆసక్తి కల వారు దిగువ పేర్కొన్న విధముగా తేది : 12-04-2023 మద్యాన్నం 1-00 గంట లోగా ధరావత్తు చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును మిగిలిన వివరములు కార్యాలయ పని వేళల యందు అడిగి తెలుసుకోనవచ్చు.

వ.నెం	వేలము వివరములు	వేలము పాటలో పాల్గొనుటకు చెల్లించ వలసిన ధరావత్తు రూ.లలో
1	2023-24 సంవత్సరమునకు అనగా తేది :01-04-2023 నుండి 31-03-2024 వరకు ఆంధ్ర రత్న కూరగాయల మార్కెట్ నందు దినసరి రుసుములు వసూలు చేసుకొనుట	రూ.530000/-లు
2	2023-24 సంవత్సరమునకు అనగా తేది: 01-04-2023 నుండి 31-03-2024 వరకు జంతువధశాల యందు దినసరి రుసుములు వసూలు చేసుకొనుట.	రూ.75000/- లు

షరతులు :

1.ప్రభుత్వ మద్దతు ధర ఉత్తర్వులు /గ్రామపంచాయితీ నోటిఫికేషన్ ప్రకారం పాటలు నిర్వహించ బడును.
2.గ్రామపంచాయితీకి బకాయిలు ఉన్నవారు వేలము పాటలో పాల్గొనుటకు అనర్హులు. 3. వేలము షరతులకు లోబడి మాత్రమే పాటలో పాల్గొన వలెను.
4.సహేతుక కారణాలు ఉన్నచొ వేలము పాటను వాయిదా వేయుటకు పంచాయితీ కార్యదర్శి వారికి పూర్తీ అధికారము కలదు.

పంచాయితీ కార్యదర్శి గ్రామపంచాయితీ,
ఈపురుపాలెం

గ్రామాల్లో దాహం కేకలు..

- వెంటాడుతున్న నీటి సమస్య
- మరమ్మతులకు గురైన డీప్‌బోర్లు, చేతి పంపులు
- అరకొరగా సాగర్ నీరు
- ప్రజలకు తప్పని అవస్థలు

ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలో దాహం కేకలు తప్పడం లేదు. చేతిపంపులన్నీ మరమ్మతులకు గురయ్యాయి. డీప్‌బోర్లలో కొన్ని నిరుపయోగంగా మారాయి. కొన్ని బోర్లలో అరకొరగా నీరు వస్తుంది. బిందె నిండటానికి గంటల సమయం పడుతుంది. సాగర్ నీటి సరఫరా జరుగు తున్నా పైపులైన్లు పగిలిపోవడం, మరమ్మతులకు గురి కావడం లాంటి కారణాలతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు అనుమతులు ఇచ్చినప్పటికీ పాత బిల్లులు రాకపోవడంతో యజమానులు ముందుకు రావడం లేదు.

పేరుకే 413 చేతి పంపులు..

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కలిపి 413 చేతి పంపులు ఉన్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు లెక్కలు తేల్చారు. క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా గత ఫిబ్రవరి ఒకటో తేది నుంచి మార్చి 17 వరకూ చేతి పంపులు, డీప్ బోర్ల మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో 413 చేతి పంపులకు గాను 367 చేతి పంపులు పనికి రావని తేల్చారు. అవి పైకి చేతి పంపులా కనిపిస్తున్నా లోపల పైపులు కూడా లేకపోవడం గమనార్హం. 52 చేతి పంపులు అటవీ ప్రాంతంలో పని చేస్తున్నట్లుగా గుర్తించారు. డీప్‌బోర్లు వివిధ స్కీంల ద్వారా 20 ఉండగా 15 పని చేయడం లేదు. వెంకటాద్రిపాలెం, గంజివారిపల్లి, భట్టువారిపల్లి, అయ్యంబొట్లపల్లి, అమానుగుడిపాడు గ్రామాల్లో అరకొరగా డీప్‌బోర్ల నుంచి నీరు వస్తుంది.

206 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా..

తమ్మడపల్లి పంచాయితీలో 20 ట్యాంకర్లు, చెన్నరాయునిపల్లి 12, గంజివారిపల్లి 15, గుర్రపుశాల 15, అమానుగుడిపాడు 25, వాదంపల్లి 15, గురిజేపల్లి 14, చిన్న కొలుకుల 8, మొగుళ్లపల్లి 4, రేగుళపల్లి 5, కొలుకుల 5, కాశికుంట తాండా 8, పిల్లికుంట తాండా 2, మొట్టబోడు తాండా 2, మురారిపల్లి 30, మిల్లంపల్లి 10, ఇందిరమ్మ కాలనీ 20 చొప్పున ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన ట్యాంకర్ యజమానులకు ప్రభుత్వం నుంచి రూ. 62 కోట్లు నీటి బిల్లులు రావాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికీ బిల్లులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం నీటి సరఫరాను ప్రారంభించారు. అనుమతులు ఇచ్చిన ట్యాంకర్లలో సగం ట్యాంకర్లు మాత్రమే తోలి మొత్తం తోలినట్లు లెక్కలు చూపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ, యర్రగొండపాలెం

మండలంలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతులు కోరాం. అధికారుల అనుమతులు రాగానే మరిన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేస్తాం.

బైను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

పదో తరగతి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పదో తరగతి విద్యార్థి రోడ్డు ప్రమాదంతో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతల సమీపంలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. చింతల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భూమని రవీంద్ర (16) అనే చెంచు గిరిజన విద్యార్థి దోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోపదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష రాశాడు. అనంతరం బైకుపై చింతల ఆశ్రమ పాఠశాలలకు వెళ్లాడు. స్నేహితులు మార్గమధ్యలో తమ బైకు ఆగిపోయిందని, అక్కడికి రావాలని పిలిచారు.

మృతిచెందిన విద్యార్థి రవీంద్ర

దీంతో రవీంద్ర వెళ్తుండగా చింతల సమీపంలోకి వెళ్లే సరికి పొన్నూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బైకును ఢీకొంది. దీంతో భూమని రవీంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని . పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడు రవీంద్ర స్వగ్రామం కొర్రపోలు గ్రామం. ఆయన తండ్రి రెండు నెలల క్రితమే మృతి చెందాడు. దీంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సైకిల్‌ను ఢీకొని బోల్తా కొట్టిన బైకు

భార్యాభర్తలతో సహా చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి- శింగరాయకొండ

సైకిల్‌ను మోటారు బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి త్రీవ గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండలోని పాకల రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పాకల క్రిస్టియన్ పాలెంకు చెందిన చందు, సలోమియా తన ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి బైకుపై శింగరాయకొండ నుంచి పాకల గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో ఓ వ్యక్తి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో సైకిల్‌ను బైకు ఢీకొని అదుపు తప్పి బోల్తాకొట్టింది. దీంతో బైకుపై

గాయపడిన సలోమియా

గాయపడిన చందు

ఉన్న చందు, సలోమియా, ఓ చిన్నారికి గాయాలయ్యాయి క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని సింగరాయకొండ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

మృతి చెందిన ఇజ్రాయేలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన పుల్లలచెరువు మండలం కొమరోలు గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుందతి. మృతుడి బంధువుల కథనం ప్రకారం... పుల్లలచెరువు మండలం యండ్రపల్లి గ్రామానికి చెందిన కంచెపోగు ఇజ్రాయేలు (20) యర్రగొండపాలెంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. రోజు లాగే బైకుపై కళాశాలకు బయలు దేరాడు. కొమరోలు గ్రామ సమీపంలోకి వెళ్లే సరికి 565 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం బైకు ఢీ కొట్టింది. దీంతో ఇజ్రాయేలు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు ఇజ్రాయేలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులను అప్పగించారు. పుల్లలచెరువు ఇన్‌ఛార్జి ఎస్ఐ జి. కోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన లాజర్

బైకులు ఢీకొని .. యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నర్సరావుపేట మండలం రావిపాడు వద్ద శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన వంకాయలపాటి లాజర్(23) అనే యువకుడు లాజరు బేల్దారి పనుల నిమిత్తం హైదరాబాదుకు వెళ్లాడు. శనివారం బైకుపై స్వగ్రామానికి బయలు దేరాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చే బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో లాజర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. లాజర్ మృతితో వంకాయల పాడులో విషాద ఛాయలు అలముకున్నాయి.

విద్యుత్ తీగలు చోరీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలను అప హరించారు. ఈ ఘటన మండల పరిధిలోని యడవల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీ వద్ద చోటు చేసుకుంది. కాలనీ ఎదురుగా ఉన్న పంచాయతీ బోర్లకు సంబంధించిన రూ.12 వేల విలువైన సుమారు 100 మీటర్ల విద్యుత్ వైర్లను చోరీ చేసినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది మోహన్‌రావు, సెక్రటరీ మిద్దె రంగస్వామి తెలియజేశారు.

నకిలీ రిజిస్ట్రేషన్లకు చెక్

- కొత్త జీవో విడుదల
- పన్ను రశీదు తప్పనిసరి
- సివిల్ తగాదాలకు తెర

ప్రజాశక్తి -ఒంగోలు క్రైం

రిజిస్ట్రేషన్‌లో అవకతవకలు, డబుల్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకుండా చేసేందుఉ ప్రభుత్వం కొత జీవోను విడుదల చేసింది. ఈ జీవో ఈనెల 1 నుంచి అమలులోకి వచ్చింది. స్థల యజమానుల హక్కులకు భంగం కలగకుండా ఈ జీవోను విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం ఎవరైనా తమ స్థలాన్ని అమ్ముకోవాలంటే అది కొనుగోలు చేసేవారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీలో తప్పని సరిగా పన్ను రశీదు కలిగి ఉండాలని నిబంధన పెట్టారు. గతంలో దస్తావేజులు, ఇసిల ఆధారంగా రిజిస్ట్రేషన్ జరిగేది. కొత్త నిబంధనతో పన్ను రసీదు తప్పని సరి చేశారు. సాధారణంగా ఖాళీ స్థలాలకు పన్నుల చెల్లింపు తక్కువగా ఉంటుంది. స్థల యజమాని ఇల్లు నిర్మించుకునే సమయంలో ఫీజు చెల్లించి అనుమతి తీసుకుంటారు. ఎవరైనా ఖాళీ స్థలానికి రిజిస్ట్రేషన్ చేయాలంటే ఆ వ్యక్తి పేరుతో వెకెంట్ లాండ్ ట్యాక్స్ (విఎల్‌టి) కట్టి ఉండాలి. సంబంధిత మున్సిపాలిటీలో అసెస్మెంట్ నంబరు కలిగి ఉండాలి. రిజిస్ట్రేషన్ సమయంలో రిజిస్ట్రార్‌కు అనుసంధానం చేసిన వెబ్‌సైట్‌లో అసెస్మెంట్ నంబరు సంబంధిత పేరు కలిగి ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తారు. ఒక

వేళ అసెస్మెంట్ నంబర్ ఉండి అది వెబ్‌సైట్‌లో కనిసించకుంటే రిజిస్ట్రేషన్ జరగదు. వాస్తవంగా పన్ను చెల్లించి అసెస్మెంట్ నంబర్ కనిపించకుండా ఉంటే వారు సంబంధిత కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్ చేయించుకోవచ్చు. ఒకవేళ అది నకిలీ ది అయితే వారు సంబంధిత కార్యాలయానికి వెళ్లారు. తిరిగి రిజస్ట్రేషన్‌కు వచ్చే అవకాశం ఉండడు. దీంతో వాస్తవ స్థల యజమానే రిజిస్ట్రేషన్ చేసే అవకాశముంది. నకిలీ రిజిస్ట్రేషన్‌కు తెరపడుతుంది. మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ అనుమతి తీసుకొని ఏర్పాటు చేసిన వెంచర్లలోని ప్లాట్లకు ఎల్‌పి నంబరు ఉంటే రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఎల్‌పి నంబర్లు ఆయా రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపుతారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌కు చెక్..

ఏదైనా స్థలాన్ని గతంలో ఒకరికి విక్రయించి మళ్లీ అదే స్థలాన్ని హద్దులు మార్చి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం డబుల్ రిజిస్ట్రేషన్ అవుతుంది. ఇలా చేయడం వల్ల ఇద్దరు వ్యక్తులు నష్టపోయే అవకాశముంది. ఆ భూమి ఎవరి చెందుతుందనే విషయాన్ని తేల్చు కునేందుకు వారిద్దరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుంది. వివాదం పరిష్కరించు కొనేందుకు చాలా సమయం పడుతుంది. అలాంటి వివాదాలకు అవకాశం లేకుండా ఉండేందుకు ఈ జీవో ఉపయోగ పడుతుంది. ఓ వ్యక్తి ఒకే స్థలాన్ని ఇద్దరు వ్యక్తులకు విక్రయిస్తే వారు విఎల్‌టి కోసం సంబంధిత కార్యాలయానికి వెళ్తే ఆ భూమి ఇతరులకు అమ్మి ఉంటే తెలిసిపోతుంది. దీంతో రెండోవ్యక్తి ఆ స్థలాన్ని కొనుగోలు చేయరు. ఇద్దరు వ్యక్తులు మోసపోయే పరిస్థితి ఉండదు.

పూర్వీకుల ద్వారా సక్రమించిన ఆస్తికి...

పూర్వీకుల ద్వారా సంక్రమించిన ఆస్తులకు గతంలో వారి కుటుంబ సభ్యులు సంబధిత సర్టిఫికెట్లు ఇస్తే రిజిస్ట్రేషన్ జరిగేంది. ప్రస్తుతం ఈ జీవో ప్రకారం అన్ని సర్టిఫికెట్లు ఉన్నప్పటికీ సంబంధిత మున్సిపాలిటీ, కార్పొరేషన్, నగరపంచాయతీ నుంచి అసెస్మెంట్ నంబరు తప్పని సరిగా తీసుకురావాలి. అస్మిసెంట్ నంబర్ ఆన్‌లైన్‌లో చూసి రిజిస్ట్రేషన్ చేస్తారు. తద్వారా తరతరాలుగా వస్తున్న ఆస్తి తగాదాలు తగ్గే అవకాశం ఉంది.

ఎన్‌జి రంగా అనుచరుడు రామప్రకాశరావు మృతి

ప్రజాశక్తి - పంగులూరు

రామ ప్రకాశ రావు (ఫైల్)

స్వతంత్ర పార్టీ నాయకుడు, ఎన్‌జి రంగా అనుచరుడు రావూరి రామ ప్రకాశ రావు(84) పంగులూరులోని తన స్వగహంలో శనివారం మృతిచెందాడు. ప్రకాశరావు వద్ధాప్యం కారణంగా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల కొద్దిరోజులుగా మంచానికే పరిమితమయ్యాడు. రాంప్రకాశరావు యువకుడిగా ఉన్నప్పటి నుంచి చైతన్యవంతంగా ఉండేవాడు. 50 ఏళ్ల క్రితం ముప్పవరం నుంచి పంగులూరు కు రోడ్డు వేస్తుండగా కాంట్రాక్టర్ రహదారిని సక్రమంగా నిర్మించడం లేదని, అవకతవకలకు పాల్పడుతున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్య తీసుకునే విధంగా చేశాడు. అప్పట్లో రామ ప్రకాశరావు అధికారులకు పత్రాలు రాసి ఫిర్యాదు చేయడం అనేది ఈ ప్రాంతంలో సంచలనం సష్టించింది. రామ ప్రకాశరావు 1977లో జనతా పార్టీ లో చేరాడు. స్వతంత్ర పార్టీ నాయకుడు ఎన్‌జి రంగాకు అభిమానిగా, అనుచరుడుగా ఉంటూ కార్యక్రమాలు చేపట్టేవాడు. 1987లో పత్తి రైతుల ఆత్మహత్య ఉద్యమాలు జరుగుతున్న సమయంలో ఎన్‌జి రంగా పంగులూరు వచ్చినప్పుడు ఆయన వెంటే ఉన్నాడు. ఆయనకు ఇక్కడ సమస్యలను తెలియజేశాడు. అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు సన్నిహితంగా ఉంటూ ఆయన్ని అభిమానంగా చూసేవాడు. వెంకయ్య నాయుడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పంగులూరులోని రామ ప్రకాశరావు ఇంటికి వచ్చాడు. రామ ప్రకాష్‌రావుకు భార్య రమాదేవి, కుమారులు వెంకట సుబ్బారావు, నాగజ్యోతి, కుమార్తె మహాలక్ష్మి ఉన్నారు. వెంకట సుబ్బారావు కొండమూరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా, మరో కుమారుడు నాగజ్యోతి ముంబైలో సాఫ్ట్వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. రామ ప్రకాశ రావు(84) అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు : ఎస్‌పి

బాపట్ల జిల్లా : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా నో యాక్సిడెంట్స్ స్పెషల్ డే డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యమైన కూడళ్లు, బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్ద హెల్మెంట్ ధరించక పోవడం వలన కలిగే అనర్ధలను గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుక ంటున్నట్లు తెలిపారు. కొందరు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభ విస్తున్నాయన్నారు. ప్రమాదాలలో మద్యం తాగి వాహనాన్ని నడిపిన వారు ఆ బైకుపై ఎక్కిన ప్రయాణికులు, బాటసారులు ప్రమాదాలకు గురై తమ ప్రాణాలను పోగొట్టుకుంటు న్నారన్నారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నా మన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి వెలిగండ్ల

పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నట్లు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని మొగులూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటి యజమానుల అనుమతి మేరకు గృహాలకు జగనన్న స్టిక్కర్లు అంటించారు .ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతి రెడ్డి, జార్జ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తాత పూడి దేవసహాయం, తాతపూడి సురేష్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పొల్ల సుబ్రహ్మణ్యం, నాగూర్ యాదవ్, కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, గంజి రవీంద్రారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు ఎలికా రమణయ్య , కె. వెంకటరామయ్య, రైతు సేవా అధ్యక్షుడు తమ్మినేని శివరామిరెడ్డి, ఎంపీటీసీ దేవి రెడ్డి జనార్ధన్ రెడ్డి, సర్పంచి మోపూరు లక్ష్మి,, మోపురి కోటేశ్వరరావు, బొబ్బ వెంకటరెడ్డి, వాలంటీర్లు, గహ సారధులు పాల్గొన్నారు. **బల్లికురవ రూరల్ :** మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్,బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చింతల పేరయ్య, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి టి,నరేష్, జడ్‌పిటిసి చింతల అంజలి, శ్రీనివాస్,్ర శీనువలి, జెసిఎస్ ఇన్‌ఛార్జులు, గ్రామ సర్పంచి, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గహ సారథులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా

కర్లపాలెం : మండల పరిధిలోని యెట్రవారిపాలెం గ్రామంలో జగనన్నే మా భవిషత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్ల సంఘం మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జగనన్నే మా భవిషత్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చీరాల వెంకటలక్ష్మి, ఎంపిపి యారం వనజ, జడ్‌పిటిసి పిట్ల వేణుగోపాల్ రెడ్డి, ఎంపిటిసి తాండ్ర సాంబశివరావు, గ్రామ సచివాలయ కన్వీనర్, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **రేపల్లె :** జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జడ్‌పిటిసి బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, వాలంటీర్లు, వైసిపి. నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

రేపల్లెలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంలో వైసిపి నాయకులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని జయవరం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్..' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు చేర్చాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. తాను గడప గడపకూ తిరిగే క్రమంలో నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో కొంతమంది లబ్ధిదారులకు రూ.7 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, ప్రజలు జగన్ ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, గ్రామ సర్పంచ్ మల్లవరపు పేరమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మల్లవరపు జయరామిరెడ్డి, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ మేదరమెట్ల భరత్ రెడ్డి, వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

సజావుగా పదోతరగతి పరీక్షలు

ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు

ప్రజాశక్తి-కొండపి

జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు సజావుగా సాగుతున్నాయని ఒంగోలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ యంఎస్ఎస్.అశోక్‌బాబు తెలిపారు. శనివారం నాడు కొండపిలోని పదవతగరతి పరీక్షలు జరుగుతున్న నాలుగు సెంటర్లను అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులు చక్కగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు రాస్తున్నారన్నారు. కొండపిలోని చాణక్య జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.

పరిశీలనకు వచ్చిన ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు

ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో

అత్యంత పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

ఎస్‌పి మలికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఈ నెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాల ప్రాంగణంలో ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో ముందస్తుగా భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏ.యస్.దినేష్‌కుమార్, ఎస్పీ మలికగర్గ్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మార్కాపురం ఎంఎల్ఏ నాగార్జునరెడ్డి పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం నియమించిన ప్రత్యేక అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ వీఐపీల వాహనాల రాక, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం, నిష్క్రమణ స్థలాలను, హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ఉన్న రూట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. సీఎం పర్యటన సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా మరియు బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, ఇతర శాఖల సమన్వయంతో అన్ని చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, మార్కాపురంలో జరుగుతున్న అన్ని భద్రతా ఏర్పాట్లలో ఒక్కో విభాగానికి ఒక ఇన్‌ఛార్జిని నియమించడం జరిగిందని, సీఎం పర్యటన నిమిత్తం పూర్తి స్థాయిలో బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ వెంట ట్రైన్ ఐపీఎస్ అధికారి అంకిత సురాన, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డిఎస్‌బి డీఎస్పీ బి.మరియాదాసు, మార్కాపురం డిఎస్పీ కిషోర్ కుమార్, దిశ డిఎస్పీ పల్లపు రాజు, మార్కాపురం సిఐ బీమా నాయక్, సర్కిల్ ఎస్సైలు ఉన్నారు.

ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి మలికగర్గ్

అభాగ్యులకు వరం 'మిషన్ వాత్సల్య'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విధి చిన్నచూపు చూసి, తల్లి, తండ్రి దూరమైన, ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్ చేస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క చదువుకు దూరం కాకూడదనేదనే ఉద్దేశంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రకాశం జిల్లాలో 19 ప్రాజెక్టుల పరిధిలో 2903 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు లేదా దూరమైన వారు, పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయినవారు), విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం-2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకతి వైపరీత్యానికి గుడైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహ, హెచ్ఐవి బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

- చిన్నారులకు నెలకు రూ.4 వేల ఆర్థిక సాయం
- దరఖాస్తుకు 15వ తేదీ వరకు గడుపు పెంపు

వార్షికాదాయ పరిమితి..

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. జువనైల్ జస్టిస్ (జేజే) బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా స్పాన్సర్ షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్ షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లే వారి హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలినా, పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేస్తారు.

మండల స్థాయి స్క్రూట్నీ కమిటీ పరిశీలన..

దరఖాస్తులను మూడు సెట్లుగా తయారు చేసి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇవ్వాలి. అక్కడి నుంచి ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నింటినీ తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లతో కూడిన మండల స్థాయి స్క్రూటినీ కమిటీ పరిశీలిస్తుంది. ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తరువాత సమావేశంతో పాటు దరఖాస్తులన్నిటినీ జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికార అధికారి కార్యాలయానికి సమర్పిస్తారు.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు..

- బాలుడి, బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి ఆధార్ కార్డులు
- తల్లి, తండ్రి డెత్ సర్టిఫికెట్
- గార్డియన్ ఆధార్
- రేషన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజు ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బాలుడు లేదా బాలిక వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్ లేదా తల్లి, తండ్రి, సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్ వివరాలు..

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తున్నాం

ముండ్లా ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త, నాయుడుపాలెం

మిషన్ వాత్సల్య పథకం దరఖాస్తులు స్వీకరించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ దరఖాస్తులు తీసుకోవాల్సిందిగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమం ప్రారంభించాం. వచ్చిన దరఖాస్తులను ప్రాజెక్టు అధికారులకు అందిస్తాం.

వాలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాం

రాధాదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శి, యర్రగొండపాలెం-2

మిషన్ వాత్సల్య పథకంపై వాలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాం. అర్హులైన వారు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరాం. మిషన్ వాత్సల్య పథకంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..

ఎం పద్మావతి, సీడీపీవో, యర్రగొండపాలెం

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. నిరాదరణకు గురైన వారి నుంచి ఈ నెల 15వ తేది వరకూ దరఖాలు స్వీకరిస్తాం. సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్, మహిళా పోలీసులు ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వాటిని సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలి. వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ కమిటీ పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

89 బేళ్లు తిరుగుముఖం

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రంలో శనివారం వేలం కేంద్రానికి అన్ని గ్రామాలకు చెందిన పొగాకు రైతులు స్క్రాబ్ అండ్ బిట్సు బేళ్లు 788 అమ్మకానికి పెట్టారు. అందులో 699 బేళ కొనుగోలు చేయగా మిగిలిన 89 బేళ్లు వివిధ కారణాలతో ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర రూ.103, అత్యల్ప ధర రూ.50, సరాసరి ధర రూ.75.55 పలికింది.

సేవా దృక్పథానికి నిదర్శనం అన్నదాన సత్రాలు: ఈవో

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

సేవా దృక్పథానికి నిదర్శనం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం అన్నదాన సత్రాలని దేవస్థానం కార్యనిర్వాహ్నాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి అన్నారు. రాచర్ల మండలం, జెల్లివారిపుల్లలచెరువు గ్రామ సమీపాన దట్టమైన నల్లమల్లఅడవి ప్రాంతంలో వెలసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఇక్కడున్న అన్నదాన సత్రాలు చేసిన సేవలను గురించి ఆయన తెలియజేశారు. మూడు రోజులపాటు మూడు పూటలా కుల మతాలకతీతంగా భక్తులకు అన్నదానం చేశారని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంలోనే కాకుండా మిగతా ప్రతి శనివారం ఇక్కడ యోగి వేమారెడ్డి అన్నదాన సత్రం, కాశిరెడ్డి నాయన అన్నదాన సత్రం, గోపాలకష్ణ అన్నదాన సత్రం, శ్రీకష్ణదేవరాయ అన్నదాన సత్రములు వందలాది మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలో పదోతరగతి పరీక్షలకు సంబంధించి శనివారం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈవో బి మస్తాన్ నాయక్ తెలియజేశారు. దోర్నాల మండల కేంద్రంలో మొత్తం నాలుగు సెంటర్లలో 633 మంది విద్యార్థులు గాను 631 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 222 మందికి విద్యార్థులకు గానూ 220 మంది, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 180 మంది విద్యార్థులు గానూ 180 మంది, రవీంద్ర హై స్కూల్‌లో 128 మంది విద్యార్థులకు గానూ 128 మంది, కేజీబీవీలో 103 మందికి గానూ 103 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలి

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



'గడపగడపకూ..' కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ప్రజాశక్తి-ముండ్లమూరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులకు ఉందని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మండలంలోని పసుపుగల్లు గ్రామంలో శనివారం ఆయన పాల్గొని ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు రేషన్ కార్డులు లేవని, పెన్షన్ రావడం లేదని, రోడ్లు కావాలని అడిగారు. బిటెక్ విద్యార్థి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు బాగానే ఉన్నాయి గానీ రాష్ట్రంలో పరిశ్రమలు లేవని, చదువుకున్న విద్యార్థులకు ఉపాధి ఎక్కడ నుండి కల్పిస్తారని, పరిశ్రమలు స్థాపించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయంలో అధికారులతో రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి సునీత బ్రహ్మానందరెడ్డి, సచివాలయ కన్వీనర్ జయంతి, సర్పంచ్ వరగాని బాలసుందరరావు, నాయకులు బిజ్జం సుబ్బారెడ్డి, జిల్లెలమూడి శివయ్య, ఎంపిడిఓ కుసుమకుమారి, ఏపిఓ కొండయ్య, ఏఈలు జె భూరాజు, మధు, పంచాయితీ కార్యదర్శి మధు, విఆర్ఓ పాల్గొన్నారు.

పొదిలి: పొదిలి నగర పంచాయతీలోని రెండో సచివాలయం, ఆరో వార్డులో 'మా భవిష్యత్తు నువ్వే.. మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ జి.శ్రీను, ఆరో వార్డు అధ్యక్షులు రాంబాబు, వార్డు వాలంటీర్లు హసేన్, కరిముల్లా, వెంకటేష్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూర్తి కుటుంబసభ్యులకు సిపిఎం పరామర్శ

ఆదిమూర్తి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామానికి చెందిన యుటిఎఫ్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు వల్లభుని ఆదిమూర్తి కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు శనివారం పరామర్శించారు. బుధవారం నాడు ఆయన మూలగుంటపాడులోని నివాసంలో మృతి చెందడంతో ఆస్ట్రేలియాలో ఉంటున్న ఆదిమూర్తి భార్య రమాదేవి శనివారం వచ్చారు. దీంతో శనివారం ఆదిమూర్తి అంత్యక్రియలు నిర్వహించారు. ఆదిమూర్తి కుటుంబసభ్యులను సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, నెల్లూరు జిల్లా నాయకులు ముప్పరాజు కోటయ్య, శింగరాయకొండ మండల నాయకులు టంగుటూరి రాము, ప్రేముల బాబురావు, పడిదపు రవికుమార్ పరామర్శించారు.

వైద్యశిబిరానికి వచ్చిన ప్రజలు

400 మందికి ఉచితంగా వైద్యసేవలు

ప్రజాశక్తి-కురిచేడు

మండల పరిధిలోని అవులమంద గ్రామంలో కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఏపిడబ్ల్యుజేఎఫ్ నేతత్వంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ కిడ్నీ వైద్య నిపుణులు జి.రమేష్ బాబు, గుండె వైద్య నిపుణులు కె.శ్రీధర్‌బాబు, గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు జగదీశ్వర్ రెడ్డి, సాధారణ వైద్య నిపుణులు రామాంజనేయులు, స్త్రీల వ్యాధుల వైద్య నిపుణులు సజని ప్రజలకు ఉచితంగా సేవలందించారు. సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి.. మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏపిడబ్ల్యుజేఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్వీ బ్రహ్మం పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకొని బయటకు వస్తున్న ఎమ్మెల్యే స్వామి

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

తిరుమలలోని వెంకటేశ్వర స్వామిని శనివారం కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ(సత్య), తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు దర్శించుకున్నారు. విఐపి బ్రేక్ దర్శనంలో నెల్లూరు ప్రకాశం జిల్లా ముఖ్య నాయకులతో కలిసి.. శ్రీవారి ఆలయంలోకి వెళ్లారు.

ఎమ్మెల్యే బలరాంతో దద్దాల నారాయణ

బలరాంను కలిసిన జడ్పీటీసీ దద్దాల

ప్రజాశక్తి-కనిగిరి

ఎమ్మెల్యే కరణం బలరాంను, ఆయన కుమారుడు కరణం వెంకటేశ్‌ను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గృహంలో హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యులు డాక్టర్ దద్దాల నారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరి నియోజకవర్గంలో నెలకొన్న పార్టీ పరిస్థితులను వారికి వివరించారు. కనిగిరిలో వైసీపీ అభివృద్ధికి తాను చేస్తున్న కృషి గురించి వెల్లడించారు.

మాలకొండస్వామి ఆలయం వద్ద సత్యనారాయణరెడ్డి

మాలకొండస్వామిని దర్శించుకున్న సత్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మాలకొండస్వామిని శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న రోజుల్లో కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలని, ఈ ప్రాంత ప్రజలు సంతోషంగా జీవనం సాగించాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట వైసీపీ నాయకులు మూలె గోపాల్‌రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి ఉన్నారు.

వైభవంగా గుంటిగంగమ్మ తిరునాళ్ల

పూజలు చేస్తున్న బూచేపల్లి కుటుంబం

- పూజలలో పాల్గొన్న బూచేపల్లి, మాగుంట, మద్దిశెట్టి

- అలరించిన 11 విద్యుత్ ప్రభలు

ప్రజాశక్తి-దరిశి

తాళ్లూరు మండలం, తూర్పుగంగవరం పంచాయతీలోని సోమవరప్పాడు సమీపాన ఉన్న గుంటిగంగమ్మ భవాని అమ్మవారి తిరునాళ్ల అత్యంత వైభవంగా శనివారం జరిగింది. ఈ సందర్భంగా తాళ్లూరు మండలం, ఇతర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టరు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నందిని దంపతులు, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, దరిశి ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్, పద్మ దంపతులు, తాళ్ళూరు వైసిపి ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. గుడి చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి ఆళ్ల భాస్కరరెడ్డి ప్రముఖులకు ఆహ్వానం పలికి శాలువాలతో సన్మానించారు. అన్ని సత్రాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి 11 విద్యుత్ ప్రభలు వివిధ గ్రామాల ప్రజలు ఏర్పాటు చేశారు. దరిశి డిఎస్‌పి వి.నారాయణస్వామిరెడ్డి అధ్వర్యంలో దరిశి సిఐ జె రామకోటయ్య పర్యవేక్షణలో ఎస్ఐలు రామకృష్ణ, సంపత్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌తో పాటు పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఏర్పాటుచేసిన ప్రభలు

పూజా కార్యక్రమంలో మద్దిశెట్టి, మాగుంట

ప్రజాశక్తి
7
ఆదివారం 9 ఏప్రిల్ 2023

అంబేద్కర్ జయంతి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహిస్తున్న అంబేద్కర్ 132వ జయంతి సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, కెవిపిఎస్ సీనియర్ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. అంబేద్కర్ జయంతి సభకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న మనువాద పాలకులు అను అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీల సంఘం నాయకులు కత్తి మత్తయ్య, మోష, మార్కు, ప్రతిభావంతుల సంఘం నాయకుడు ఇండ్ల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జక్కుల రమేష్ బాబు, ఇశ్రాయేలు, ఆర్ఎంపి డాక్టర్స్ యూనియన్ నాయకులు వినయ్ తదితరులు పాల్గొన్నారు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- బల్లికువర రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో మండల పరిధిలోని నక్క బొక్కలపాడు గ్రామంలో రోటరీ సెక్రటరీ కుర్రా వెంకటరామయ్య సహకారంతో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి పది రోజుల్లో కంటి అద్దాలు ఉచితంగా అందజేసున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు కార్యదర్శి కుర్రా వెంకటరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ కొర్రపాటి కాజారావు, ఇంటూరి ఆంజనేయులు, కొర్రపాటి సుబ్రహ్మణ్యం, రోటరీ మాజీ అధ్యక్షుడు జె.సాంబశివరావు కోటేశ్వరరావు ,రావి అంకమ్మ చౌదరి, ఖాజా హుస్సేన్, చెరుకూరి నాగేశ్వరరావు, మండవ నరేంద్ర బి. సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం రోటరీ సభ్యుడు చెరుకూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - చీరాల

పేదల అవసరాలను గుర్తించి వారికి చేయూతనందించేందుకు పద్మ భాస్కర్ ఫౌండేషన్ స్థాపించినట్లు ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ తెలిపారు. చీరాల పట్టణంలోని 31వ వార్డ్ రోశయ్య కాలనీలో పద్మ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గంట అనిల్ మాట్లాడుతూ పద్మ భాస్కర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని దానాలలో అన్న దానం గొప్పదని తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై నన్నపనేని వెంకటసుబ్బరావు సతీమణి ఇందిరా దేవి స్వచ్ఛందంగా ముందుకొచ్చి అన్నదానానికి సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలివేటి పూర్ణచంద్ర రావు, ఘంటా కుసుమ కుమారి,31వ వార్డు కౌన్సిలర్ సల్లూరు సత్యా నందం, రోశయ్య కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన పెదలంక లక్ష్మీ మాధవి అనే మహిళ ఇటీవల మృతిచెందింది. పేద కుటుంబానికి చెందిన లక్ష్మీ మాధవి మతి గురించి సమాచారం తెలుసుకున్న బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మృతురాలి కుటుంబ సభ్యులను శనివారం పరిమర్శించారు. తన వంతు సాయంగా ఆర్థిక సహాయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, నియోజకవర్గ నాయకులు పోతార్లంక రాజేష్, ఎంపిటిసి వాకా వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న కేసన శంకరరావు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

పారిశుధ్య కార్మికుల సంక్షేమమే తమ కర్తవ్యమని ఆశాలత ట్రస్ట్ సభ్యులు, ఆదాయ పన్ను శాఖ అధికారి కురుకుంట్ల సిల్వన్ రాజ్, ట్రస్ట్ చైర్మన్ కురుగుంట్ల స్నేహలత తెలిపారు. సిల్వన్ రాజ్ కుమారుడు కురుగుంట్ల సువర్ణ రాజు 31వ పుట్టిన రోజు సందర్భంగా పంచాయతీ కార్మికులకు బియ్యం, నిత్యావసర సరుకులు, చికెన్ శనివారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా సిల్వన్ రాజ్ మాట్లాడుతూ ప్రతి రోజూ వీధులను శుభ్రపరిచే పారిశుధ్య కార్మికులకు ఏమి చేసినా తక్కువే నని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచి మక్కెన కోటేశ్వరరావు, క్రీడ్ మినిస్ట్రీస్ స్థాపకులు జోబ్, పాస్టర్ జెల్లి సోహ, డాక్టర్ కురుగుంట్ల మౌనిక, కురుగుంట్ల ప్రసన్న, వార్డు సభ్యులు బొడ్డు నాగకుమారి, జడా కోటయ్య, పంచాయతీ కార్యాలయం సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

సిఐ రాంబాబుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్

ఒంగోలు తాలూకా నూతన సిఐగా ఆర్. రాంబాబు బాధ్యతలు చేపట్టారు. అందులో భాగంగా సంతనూతలపాడు మండల వైసిపి నాయకులు సిఐ రాంబాబును శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిఐకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్ దుంపా యలమందరెడ్డి, 40 వ డివిజన్ కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్, 42వ డివిజన్ వైసిపి నాయకుడు నూకతోటి ఈశ్వరరావు, రాజేష్ తదితరులు ఉన్నారు.


సిఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

పదో తరగతి విద్యార్థినికి అస్వస్థత

ఇంకొల్లు రూరల్ : ఇంకొల్లులోని ఆదర్శ హైస్కూలులో పదో తరగతి పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని శనివారం అస్వస్థతకు గురైంది. పరీక్ష రాస్తున్న సమయంలో ఫిడ్స్ రావడడంతో కుప్పకూలి పోయింది. వెంటనే ఆ విద్యార్థిని ఇంకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ అస్వస్థత గురైన విద్యార్థి వెంటే ఉండి వైద్య పరీక్షలు చేయించాడు. విద్యార్థి అనారోగ్యం పట్ల సకాలంలో స్పందించిన ఎస్ఐ నాయబ్ రసూల్‌కు విద్యార్థి తల్లిదండ్రులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని

10న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో విజయవాడకు చెందిన అను మై బేబీ కేర్ వారి ఆధ్వర్యంలో ఈనెల 10న ఉచిత తల్లిబిడ్డల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రేపల్లె ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బాషా, డాక్టర్ మణి గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నటు తెలిపారు. మండల పరిధిలోని గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

15న మండల సమావేశం

ప్రజాశక్తి- మద్దిపాడు

మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహించ నున్నట్లు ఎంపిడిఒ వై. శ్రీనివాసరావు తెలిపారు. ఎంపిపి వాకా అరుణ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖ అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- సంతనూతలపాడు రూరల్

2023 –24 విద్యా సంవత్సరంలో ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు, గణపవరం, అమ్మనబ్రోలు గ్రామాల్లోని గురుకుల విద్యాలయాలలో ఐదవ తరగతి, జూనియర్ ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎపి గురుకుల విద్యాల యాల జిల్లా కన్వీనర్ సంతనూతలపాడు గురుకుల విద్యాలయ ప్రధానాచార్యులు మెర్సి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 24లోపు దరఖాస్తు చేసు కోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మే నెల 20న నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

శేషవాహనంపై చెన్నకేశవుడు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని వెంకటాద్రిపాలెంలోనున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామివారు శేష వాహనంపై భక్తులకు శనివారం దర్శనమించ్చారు. ఈ సందర్భంగా ఉభయదాతలు గోపాలుని సుబ్బ లక్ష్మమ్మ, గోపాలుని రాఘవేంద్ర ప్రవీణ్, గోపాలుని ప్రకాశరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి అద్దంకి

పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం ఇంగ్లీష పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 1038 మంది విద్యార్థులకు గాను 1036 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఇఒ పివి. రాఘవరావు తెలిపారు

సాహితీ బ్రహోత్సవాలకు మార్టిన్ లూథర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి- కంభం రూరల్

కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలో హిందీ ఉపాధ్యాయుడి విధులు నిర్వహిస్తున్న మార్టిన్ లూథర్‌కు అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 9,10 తేదీలలో తిరుపతిలోని మహతి ఆడిటోరి యంలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహోత్సవాలకు ఆయనకు ఆహ్వానం అందింది. ఈ బ్రహ్మోత్సవాలను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో గిన్నిస్ ప్రపంచ రికార్డు లక్ష్యంగా 48 గంటల పాటు నిరాటంకంగా నిర్వహించనున్నారు. సుమారు 15 వందల మంది కవులు కళాకారులు పాల్గొననున్నట్లు మార్టిన్ లూథర్ తెలిపారు. ఈ సందర్భంగా మార్టిన్ లూథర్‌కు ఎంఇఒ బి.మాల్యాద్రి,ఉపాధ్యాయులు అభినందించారు.

టిడ్కో గృహాలపై చర్చకు సిద్ధమా.?

- చంద్రబాబునాయుడుకి మంత్రి సురేష్ సవాల్ - త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వ హయాంలోనే టిడ్కో గృహాలు అన్ని హంగులతో నిర్మించటం జరిగిందని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. 'టిడ్కో గృహాల నిర్మాణంపై చర్చకు సిద్ధమా.?' అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకి సవాల్ విసిరారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి సురేష్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలందరికి గృహాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 31 లక్షల పట్టాలు ఇచ్చి అర్హులైన పేదలందరికీ గృహాలు నిర్మిస్తున్నామని, ఇది దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలలో 2.63 లక్షల టిడ్కో గృహాలను అన్ని హంగులతో మంచినీరు, విద్యుత్ సౌకర్యం ఇతర సౌకర్యాలు కల్పించటం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు వదిలేస్తే వైసిపి ప్రభుత్వం హయాంలో నిర్మాణంలో అనేక సంస్కరణలు చేపట్టామన్నారు. నెల్లూరు జిల్లాలో జరిగిన టిడిపి సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు నాయుడు, లోకేష్ టిడ్కో గృహాల వద్ద సెల్ఫీలు దిగి తాము వాటిని పూర్తి చేసినట్లు చెప్పుకుంటున్నారన్నారు. గత టిడిపి హయాంలో వెంకటేశ్వరపురంలో పనులు మొదలుపెట్టకపోవటం, వైసిపి ప్రభుత్వంలో పూర్తి చేసిన ఫొటోలను చూపించారు. 1.45 లక్షల ఇళ్లకు రూ.1 చెల్లిస్తే మొత్తం ఇళ్లు కట్టిస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని ఏ ఛానల్ పట్టించుకోలేదన్నారు. రూ.1200 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. సెల్ఫీలు తీసుకుంటూ నిస్సిగ్గుగా తామే టిడ్కో ఇళ్లు కట్టామని చెప్పటం దుర్మార్గమన్నారు. టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.8800 కోట్లు ఖర్చు పెట్టామని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారునికి ఏ భారం పడదని, అంతా ప్రభుత్వం భరిస్తుందన్నారు. మౌలిక వసతులు కల్పించి దశలవారీగా 50 వేల టిడ్కో గృహాలు అందజేశామన్నారు. ఫేజ్-3లో మిగిలిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలని సిఎం ఆదేశాల మేరకు వాటిని పూర్తి చేసి ప్రజలకు అందజేస్తామన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రమేష్

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండలంలోని పేర్నమిట్ట, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం గ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఒంగోలు, 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్ శనివారం ప్రారంభించారు. మొదటి మ్యాచ్ జట్లు అనకాపల్లి జిల్లా ఆటగాళ్లను, అన్నమయ్య జిల్లా ఆటగాళ్లను ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాదాసు వినోద్ మలగా రమేష్‌కి పరిచయం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాస పవన్, చల్ల కృష్ణ, మదాసు రవి, సాంబ పాల్గొన్నారు..

'వందే భారత్' రైలుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-బాపట్ల

వందే భారత్ రైలు బాపట్లలో ఘన స్వాగతం లభించింది. శనివారం సికింద్రాబాద్‌లో ప్రారంభించిన తిరుపతి వెళ్లే వందే భారత్ రైలును బాపట్ల రైల్వే స్టేషన్ బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి స్వాగతం పలికారు. వందే భారత్ రైలు ప్రారంభం సందర్భంగా ప్రజల సందర్శన కోసం ఐదు నిమిషాల పాటు బాపట్ల రైల్వేస్టేషన్ ఈ రైలును నిలుపుదల చేశారు. రైలుకు స్వాగతం పలికిన కోన రఘుపతి రైలు భోగీలోకి ప్రవేశించి సీట్లో ఆసీనులయ్యారు. బాపట్ల రైల్వేస్టేషన్లో ఈ రైలు చూసేందుకు వందల సంఖ్యలో పట్టణ ప్రజలు రైల్వేస్టేషన్ కు చేరుకున్నారు. వెనుక, ముందు రెండు ఇంజన్లతో కూడిన ఆరు బోగీలతో బాపట్ల చేరుకున్న రైలు ఐదు నిమిషాలు అనంతరం తిరిగి బయలుదేరింది.

'వందే భారత్' రైలుకు స్వాగతం పలుకుతున్న కోన రఘుపతి

సిఎం జగన్ పాలనలో..

తీవ్ర సంక్షోభంలో వ్యవసాయం

- **సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదని ఆరోపణ**
- **టిడిపి అధికారంలోకి వస్తేనే 'వెలిగొండ' పూర్తయ్యేది..**
- **మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తాం...**
- **మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

ప్రజాశక్తి-మార్కాపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తీవ్ర సంక్షోభంలోకి వ్యవసాయం నెట్టివేయబడిందని టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం సాయంత్రం మార్కాపురం విచ్చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ కాలంలో వ్యవసాయానికి చంద్రబాబు పెద్దపీట వేశారన్నారు. జలనవరుల శాఖ ద్వారా రూ.63 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం మాత్రం కేవలం రూ.35 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగిందన్నారు. సిఎం జగన్ వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యంగా చేశారన్నారు. అందుకే రైతుకు డ్రిప్ కూడా రాయితీపై ఇవ్వలేకపోయారన్నారు. పోలవరం ప్రాజెక్టు, వెలిగొండ ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. సాగునీటి వనరులపై దృష్టి సారించని ఫలితంగా జగన్ పాలనలో రైతన్నలు తీవ్రంగా నష్టాల్లో కూరుకుపోయారని ఆరోపించారు. పశ్చిమ ప్రకాశంలో వెలిగొండ ప్రాజెక్టు ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పినా... నేటికీ దాన్ని పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాబోతోందని, వెలిగొండ ప్రాజెక్టును తమ నాయకుడు చంద్రబాబు పూర్తి చేస్తారని చెప్పారు. జిల్లా కేంద్రానికి అర్హత కలిగిన మార్కాపురంను జగన్ పట్టించుకోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు అవుతుందని గట్టిగా చెప్పారు. ఈ నెల 20వ తేదీన మార్కాపురం మాజీ సిఎం చంద్రబాబు వస్తున్నారని, ఆ సమయంలో వెలిగొండతో పాటు మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేసే అంశాన్ని ప్రకటిస్తారని చెప్పారు. మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ ప్రాంత ప్రజల కోసం నిత్యం పోరాటాలు చేస్తున్నారని, వెలిగొండ, మార్కాపురం జిల్లా కోసం పాదయాత్ర చేపట్టిన కందులను అభినందించారు. విలేకరుల సమావేశంలో మాజీ జడ్‌పిటిసి కందుల రామిరెడ్డి, టిడిపి ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, 35వ వార్డు కౌన్సిలర్ యేర్వ వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

భజన..

భజన చేసేవాళ్లను భక్తులు అంటారు. ఇది దేవుడు విషయంలో ప్రజలందరినీ ఇప్పుడు భక్తులుగా మార్చే వ్యూహంలో పాలకపక్షం ఉంది. ఇక్కడ దేవుడు ఎవరన్నదే చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు జరుగుతోన్న పాలాభిషేకాలు మొదలు.. మీరే మాకు ధీమా.. మీరే మాకు నమ్మకం అంటూ ప్రచారాలు తెరపైకి వచ్చాయి. వాటిని ఇపుడు ప్రజలతో బలవంతంగా అనిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిజంగా జనం మదిలో నుంచి ఏది వచ్చి చేసినా అభ్యంతరం లేదు. పాలకుల ఆలోచనలను బలవంతంగా ప్రజలపై రుద్దే కార్యక్రమాలు ఇపుడు వేగిరమయ్యాయి. ఇందుకోసం పాలకపక్షం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. అసలేం జరుగుతోందన్నదే ఇపుడు ప్రశ్నగా మారింది. అధికారం కోసం పార్టీలు ఇన్నిపాట్లు పడాలా? నిజంగా ప్రజల్లో ఉంటే ఇన్ని ప్రచారార్భాటాలు చేయాలా? అంటే అంతా మైండ్ గేములుగా చెబుతున్నారు.ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు కేటాయించే డబ్బులు అన్నీ ప్రజలనుంచి వివిధ పన్నుల రూపాల్లో వసూలు చేసినవే. వాటినే ప్రభుత్వం పథకాలకు,అభివృద్ధికి వెచ్చిస్తుంది. లబ్ధిదారులకు ఈ విషయం తెలియనిదికాదు. రెండు రోజుల క్రితం జరిగిన ఓ తంతు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. పట్టణంలో ఉండే డ్వాక్రా మహిళలకు రుణాలు లేదా ఇతర రూపాల్లో ప్రభుత్వం నుంచి లబ్ధిచేకూరింది. ఇందుకుగానూ సిఎం తోపాటు మంత్రులకు పాలాభిషేకాలు చేయించారు.ఈ కార్యక్రమాన్ని మెప్మా అధికారులు దగ్గరుండి చేయించారు. బతికి ఉన్న మనుషులకు పాలాభిషేకాలు ఏమిటి? ఎవరి జేబునుంచైనా డబ్బులు ఇచ్చారా? ఎందుకు చేయించారు?అనేది అధికారులు సమాధానం చెప్పాలి. గతంలోనూ ఇదే తరహాలోనే అనాలోచితంగానే భజనలు చేశారు.ఇపుడూ ఇదే తంతుకొనసాగుతోంది.ఇలాంటి కార్యక్రమాలకు ఎంత ఖర్చు పెడుతున్నారు? ఎవరు భరించాలి?అన్నది కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి భజనలు ఈకాలంలో ఎక్కువయ్యాయి. వీటి వల్ల నష్టం తప్ప లాభం లేదని పాలకులు గుర్తించాలి.గతపాలకులకు జరిగిన అనుభవాలను మననం చేసుకుంటే వాటి ఫలాలు ఎలా ఉంటాయో తెలుస్తుంది.

ఎన్నికలే ఎజెండాగా వాడివేడి భేటీలు నడుస్తున్నాయి.ఏడాది సమయం ఉన్నా ప్రజా సమస్యలను పక్కనబెట్టేసి ఇపుడు ఎన్నికలే ఎజెండాగా ప్రధానపార్టీలు సాగుతున్నాయి.ఇందుకోసం వ్యూహాత్మకభేటీలు పెరిగాయి. గడపగడపకు సమీక్ష పేరుతో సిఎం జగన్ పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. టిక్కెట్ల వ్యవహారం తేలుతుందని భావించిన నేతలకు నిరాశేమిగిలింది. సాదాసీదాగా సమీక్ష సాగింది. ముందస్తు లేదని తేల్చారు.దీంతో పాలకపక్ష నేతలు ప్రస్తుతానికి నిర్భరంగా ఉన్నారు. ఆగస్టు దాకా గడపగడపకూ తిరగాలని గట్టిగాచెప్పారు. ఇప్పటికీ సగం గ్రామాలుకూడా పూర్తిచేయని నేతలున్నారు.ఇపుడు మరో కొత్త కార్యక్రమం తెరపైకి వచ్చింది.మీరే మా భవిష్యత్ అంటూ ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటించాలనే కార్యక్రమాన్ని చేపట్టారు.ఇవన్నీ ఎన్నికల వ్యూహాలే. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నెల్లూరులో ప్రాంతీయ సమావేశం నిర్వహించారు.దీనికి జిల్లా నుంచి పార్టీ ముఖ్యనేతలు హాజరయ్యారు. ఇక్కడా ఎన్నికల ఉపదేశమే. ఎన్నికలకు సిద్ధంగా కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. పార్టీనేతలకు ఇవ్వాల్సిన సందేశం ఇచ్చారు.ప్రతిపక్షపార్టీగా ప్రభుత్వంపై విమర్శలు తప్ప నిర్దిష్టమైన సమస్యలపై ఉద్యమాలు చేపట్టలేదు. ఎక్కువ కాలం పత్రికల్లో విమర్శలతోనే ప్రతిపక్ష నేతలు కాలం గడుపుతున్నారు. ఎన్నికల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతే గట్టెక్కిస్తుందనే భావనతో ఉన్నారు.

ఉద్యోగులు తమ డిమాండ్ల కోసం మళ్లీ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఏ ఒక్క హామీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం కనిపించడం లేదు.తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో జరిగిన సమావేశంలోనూ ఉద్యోగసంఘనేతలకు తేల్చిచెప్పారు.సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ చేయడం వంటి హామీలు ప్రభుత్వమే తేల్చాలని స్పష్టంచేశారు. దీంతో ఉద్యోగులకు ఇచ్చిన కీలకహామీలు ఏమీ ఆచరణలో అమలు కాలేదు.మలిదశ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు. ఇటీవల నల్లబాడ్జీలు పెట్టుకుని విధులు నిర్వహించారు.ఉపాధ్యాయులూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు.అన్ని శాఖల ఉద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితోనే ఉన్నారు.పోలీసుశాఖలోనే ఇదే కనిపిస్తోంది. అయితే ప్రభుత్వం మాత్రం ఉద్యోగుల డిమాండ్లపై సానుకూలంగా ఆలోచించే పరిస్థితి కనిపించడం లేదు.

ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి.బాపట్ల జిల్లా కలెక్టర్ జయలక్ష్మిని, ప్రకాశం జిల్లా జేసీని అభిషిక్తను బదిలీచేశారు. వచ్చే ఎన్నికల వరకూ ప్రస్తుతం ఉన్న కలెక్టర్లు, జేసీలు ఉండే అవకాశం ఉంది.అంటే వీరిని ఎలక్షన్ టీముగా భావించకతప్పదు. ప్రభుత్వానికి విధేయతగా ఉండే వారిని గుర్తించి కీలకస్థానాల్లో ఉంచారని సమాచారం. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ ఇద్దరి స్థానాలు పదిలంగా ఉన్నాయి.ప్రభుత్వంలో వీరికి మంచి మార్కులున్నాయని స్పష్టమవుతోంది.జేసీ బదిలీకి ఆయన పనితీరే కారణమని ఉద్యోగవర్గాల్లో చర్చసాగుతోంది.

తిరునాళ్లలు ఎప్పటిలాగే రాజకీయ హంగామాలకు వేదికలుగా మారాయి. పార్టీల నుంచి కరెంటు ప్రభలు పెడుతున్నారు. వాటికి నేతలు అన్ని రకాలుగా అండదండలు అందిస్తున్నారు. అయితే తిరునాళ్లలో జరిగే చిన్నచిన్న గొడవలే ఫ్యాక్షన్ రాజకీయాలకు దారితీశాయి. పోలీసులు అప్రమత్తంగాఉండాలి. సమస్యాత్మకగ్రామాలనుంచి ప్రభలు కదుపుతుంటారు.అక్కడ రెండు వర్గాల మధ్య పోలీసులు జాగ్రత్తగా ఉండాలి.లేకుంటే గొడవలు జరుగుతాయి. తర్వాత రాజకీయాలకు తోడై వివాదాలుగా మారతాయి. తిరునాళ్లపై నిఘా పెంచాలి.